క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన : మండలంలోని నరసాపురం మోడల్ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉంటాయన్నారు. విద్యార్థులు జూన్ 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థినులకు ఉచితంగా హాస్టల్ వసతిని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పూర్తి వివరాలకు 9010793182 నంబరులో సంప్రదించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని గురుకుల పాఠశాలలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్న దృష్ట్యా సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రం వద్ద గుంపులుగా ఉండకూడదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జిరాక్స్ సెంటర్లను తెరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ సభ్యుడిగా చంద్రశేఖర్‌రెడ్డి



అట్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సభ్యుడిగా కొండు చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం విజయవాడలోని క్రీడల శాఖ ఎండీ హర్షవర్ధన్ నియామక పత్రం అందజేశారు. ఈ మేరకు ఈ విషయాన్ని చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. తనకు ఈ పదవి అప్పగించిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధకు కృతజ్ఞతలు తెలిపారు.

5న శ్రీ లక్ష్మి సత్యనారాయణుల కల్యాణోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో జూన్ 5న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు కేహెచ్ విజయ్‌కుమార్‌భట్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 6.30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మి నారాయణ, సుదర్శన హోమాలు, 9.00 గంటలకు మహా పూర్ణాహుతి ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12.30 గంటలకు నక్షత్ర కుంభ హారతి, 1.00 గంటకు అన్నప్రసాద వితరణ ఉంటాయన్నారు.

సోమిరెడ్డిపల్లెలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు



ప్రసంగిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామంలో ఉన్న రామాలయంలో మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం, కడప హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీమద్రామాయణం, మహా భారతం, భగవద్గీతలపై చాపాడు వెంకటసుబ్బారెడ్డి ప్రవచనాలు చేశారు. భజన మండలిచే భజనలు చేయనున్నట్లు ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు తెలిపారు. శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమం ఉంటుందన్నారు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



వాహనదారులకు సూచనలిస్తున్న సీఐలు

ప్రొద్దుటూరు క్రైం : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్డుపై వాహనాలను నిలిపితే కేసులు నమోదు చేస్తామని టూ టౌన్ సీఐ ఇబ్రహీం, ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం మైదుకూరు రోడ్డు నుంచి శివాలయం సర్కిల్ వరకు సీఐలు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. దుకాణాల ముందు రహదారికి అడ్డంగా ఉన్న వాహనాలకు జరిమానా వేశారు. ట్రాఫిక్‌పై వాహనదారులు, వ్యాపారులకు అవగాహన కల్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన వారు బాచిలర్ ఆఫ్ డిగ్రీ లేక మాస్టర్ ఆఫ్ డిగ్రీలో సైన్సు, సోషల్ స్టడీస్, హ్యూమనటీస్‌లో ఓసీలు 50 శాతం మార్కులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లకు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 9966006758 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం

- ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట
- సంక్షేమ పథకాలకు రూ.1.07లక్షల కోట్లు
- గ్రామ వలంటీర్ల సన్మాన సభలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



చాపాడులో సేవావజ్ర వలంటీరును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు

చాపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమంటే చాలా సంతోషమని.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం 'గ్రామ వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే బద్రిపల్లెకు చెందిన లక్ష్మీ శాకుంతలకు సేవా వజ్ర, పల్లవోలుకు చెందిన శశికుమార్, వరలక్ష్మీ, ఖాదర్‌పల్లెకు చెందిన చాంద్‌మున్నీ, ఎస్.ఓబాయపల్లెకు చెందిన పరమేశ్, అయ్యవారిపల్లెకు చెందిన ఉస్మాన్‌లకు సేవా రత్న, 241 మందికి సేవామిత్ర పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ చుట్టూ తిరిగేవారని, వారి పార్టీ వారికే పథకాలు వచ్చేవన్నారు. కాని వైఎస్ జగన్ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలనే ఉద్దేశంతో వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. అన్ని రకాలైన పథకాలను ఇంటి వద్దకు తీసుకెళ్లి అందించే వలంటీర్లందరూ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించేలా వివరించాలని కోరారు. సమాజంలో మహిళలకు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు వారికే అందిస్తున్నారన్నారు. మహిళ బాగుపడితే వారి కుటుంబమంతా బాగుపడుతుందని సీఎం జగన్ అభిప్రాయమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రూ.1.07లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో సీఎం జగన్ ప్రతి ఏటా అందిస్తున్నారన్నారు. ప్రజలకు సేవలు అందించటంలో వలంటీర్ల మధ్య పోటీతత్వం ఉండాలనే సేవా వజ్ర రూ.30వేలు, సేవా రత్న రూ.20వేలు, సేవా మిత్ర రూ.10వేలు చొప్పున వలంటీర్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్షుమయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోలీ గుడ్డు



సాధారణ గుడ్డు పక్కనే ఉన్న చిన్న సైజు కోడిగుడ్డు

బద్వేలు అర్బన్ : అదేంటి కోడిగుడ్డు పక్కన చిన్న గోలీ సైజులో మరో గుడ్డు ఉంది. ఏదైనా పక్షిగుడ్డును కోడిగుడ్డు పక్కన ఉంచారా అని అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. అది కోడి పెట్టిన గుడ్డే. మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మిదేవి అనే మహిళ ఇంట్లో ఉన్న ఓ కోడిపెట్ట ఇలా గోలీ సైజులో గుడ్డు పెట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. గత వారం రోజులుగా గుడ్డు పెడుతున్న కోడి పెట్ట రోజూ మాదిరే మంగళవారం కూడా గుడ్డు పెట్టగా అది గోలీ సైజు పరిమాణంలోనే ఉంది. ఈ గుడ్డును చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి కనబరిచారు.

నేడు లక్ష్మీపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–91 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10 తరగతి విద్యార్థులు బుధవారం సమావేశం కానున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో అప్పటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కలుసుకోనున్నారు. ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థి కొండారెడ్డి తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం గ్రామంలో పోలేరమ్మ తిరునాల సందర్భంగా తాలూకా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో పది టీంలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.15,016లను నరసాపురం టీం గెలుచుకోగా రెండవ బహుమతి రూ.7,016లను పోరుమామిళ్ల టీం గెలుచుకున్నాయి. గెలుపొందిన టీంలకు మంగళవారం ఎస్ఐ హరిప్రసాద్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్యమఠం, కొండావధూత ఆశ్రమం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యహావాచనము, రక్షాబంధనము, మృత్యుంగ్రహణము, అంకురార్పణ, వాస్తుహోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌లకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ధ్వజారోహణం, కుంభప్రతిష్ట, అగ్ని ప్రతిష్ట, నిత్యహోమం, ఉత్సవబలి నిర్వహించి సాయంత్రం శేషవాహనసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

25న హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కడప కల్చరల్ : పవిత్ర హజ్ యాత్రికులకు ఈనెల 25న ఉచితంగా వ్యాక్సినేషన్ చేయనున్నట్లు ది ముస్లిం అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం.ఫైజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మద్రాసురోడ్డులోగల ముస్లిం ఆర్ఫనైజ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జిల్లా హజ్ సొసైటీ, ముస్లిం అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హజ్‌కమిటీ ద్వారా హజ్–2023కు వెళ్లనున్న యాత్రికులకు ఈ ఉచిత వ్యాక్సినేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు యాత్రికులకు వ్యాక్సినేషన్ చేయించుకోవచ్చని, వారికి నిర్వాహకులు హెల్త్‌కార్డులు అందజేస్తారన్నారు. యాత్రకు అవసరమయ్యే ఎహరామ్ దుస్తులతోపాటు ఇతర సామాగ్రి తక్కువ ధరకు అందించే ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు 95094 47737 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

బ్రాహ్మణపల్లెలో గాలివాన బీభత్సం

విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



గాలి బీభత్సానికి నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభం

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లెలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగిపడటంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వర్షం పెద్దగా పడకపోయినా పెద్ద ఎత్తున గాలి వీచడంతో ఇళ్ల పైకప్పులు గాలికి లేచి పోయాయి. ఒక్కసారిగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు పడిపోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సకాలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల క్రితమే శ్రీనివాసపురంలో గాలివాన బీభత్సానికి ఒక వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. పగలంతా ఎండ తీవ్రత అధికంగా ఉండటం, సాయంత్రం ఎక్కడో ఒకచోట గాలివాన బీభత్సం సృష్టిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

టీచర్ల బదిలీల్లో ఖాళీలన్నింటిని చూపించాలి



మాట్లాడుతున్న శ్యాం సుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే టీచర్ల బదిలీలలో ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నింటిని చూపించాలని ఆ మేరకు బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలోని ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల సుదీర్ఘంగా దూర ప్రాంతాల్లో పనిచేసిన సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతులకు మాన్యువల పద్ధతిలో కౌన్సిలింగ్‌ను నిర్వహించాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాస్కర్ రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, శ్రీనివాసులరెడ్డి, గురవయ్య, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు ప్రసాద్, శివానందం పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం



హెచ్ఓ రాఘవేంద్రారెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సుమారు వేలాది ఎకరాలలో అరటి పంటలు నేలకొరిగాయి. దీంతో నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, మల్లికార్జునపురం, వెలమవారిపల్లె, వెంకటాపురం గ్రామాల్లో రైతులు తమను ఆదుకోవాలని మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కర్నూలులో కలిశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత ఉద్యాన శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలోని పలు గ్రామాల్లో దెబ్బ తిన్న అరటి పంట రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కావున 100, 200చెట్లు పడిపోయిన రైతులు వారి పేర్లను నమోదు చేయాలన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి హెచ్ఓను కలిసి పంట నష్టాన్ని నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ రాజారెడ్డి వర్ధంతి

పులివెందుల టౌన్ : పులివెందుల పెద్దాయన దివంగత వైఎస్ రాజారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణరెడ్డి హాజరై దివంగత వైఎస్ రాజారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీఎం ఆంజనేయులు, కాంట్రాక్టర్ రమణ, వికలాంగుల సంఘ కార్యవర్గ సభ్యులు బాబు, అనిల్, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దు



మాట్లాడుతున్న సీఐ నారాయణ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజలందరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దని త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక వేసవి శిబిరంలోని విద్యార్థులు జేవీవీ గౌరవ సలహాదారు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరమైన వారు ఏ క్షణంలోనైనా 100కి ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామన్నారు. ఈవ్ టీజింగ్ నుంచి అమ్మాయిలను కాపాడటంలో, దొంగతనాలను నివారించడంలో పోలీసులు ముందుంటారన్నారు. ఎవరైనా మార్ఫింగ్ ఫొటోలతో బెదిరిస్తే పోలీసుల సహాయం కోరాలని తెలిపారు. మహిళలు దిశ యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న వైర్‌లెస్ సిస్టం ఎలా పనిచేస్తుంది, ఎఫ్ఐఆర్‌ను ఎలా నమోదు చేస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, లాయర్ హరిత, కోఆర్డినేటర్లు అక్షయ, హాసిని, యోచిత, జాహ్నవి, జావీద్, దస్తగిరి, మనోజ్, నిఖిల్ తేజేష్, సౌఖ్య, ధరణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌కు వినతి



సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఇన్సాఫ్ నాయకులు

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఇన్సాఫ్ నాయకులు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీలో అనేక చోట్ల తాగునీటి పైపులైన్లు లీకవుతున్నాయని తెలిపారు. వాటర్ ట్యాంకుల వద్ద పైపులైన్ లీకేజీ అయి మురికి నీరు నిలబడి పాచి పట్టి ఉందన్నారు. ఈ నీరు తాగునీటి పైపులైన్‌లో కలిసే అవకాశం ఉందని, కలుషిత నీటిని పంచాయతీ ప్రజలు తాగితే రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ వెంటనే పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తామని తెలిపారు.

పుస్తక పఠనంతో వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి



ఆంగ్లపత్రిక చదువుతున్న విద్యార్థిని

పోరుమామిళ్ల : విద్యార్థులు ఈ వేసవి సెలవుల్లో పుస్తక పఠనం ద్వారా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, గ్రంథాలయ అధికారి ఆఫ్రిది పేర్కొన్నారు. మంగళవారం సమ్మర్ క్యాంపులో భాగంగా పిల్లలతో కథలు, దినపత్రికలు, ఆంగ్లపత్రికలు, పుస్తకాలు చదివించారు. దినపత్రికల ద్వారా సమాజంలో జరుగుతున్న సంఘటనలు, ప్రపంచ సమాచారం తెలుసుకోవచ్చన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జికి సంబంధించిన అనేక పుస్తకాలు ఉంటాయని వాటిని చదవడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన



పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రొద్దుటూరు అటవీశాఖ సిబ్బంది కె.రమాదేవి, బి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలంగా మన జీవనశైలిని మార్చుకోవాలని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడతామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు వీఎం భాస్కర్ రాజు మాట్లాడుతూ భారతంలో ఏకలవ్యుడి జీవితం, గురుభక్తి గురించి విద్యార్థులకు వివరించారు. విశ్రాంత నావికాదళ ఇంజినీర్ వెంకటకొండయ్య ఇంగ్లీషు గ్రామర్, యోగా టీచర్ వెంకటసుబ్బమ్మ యోగాసనాలను, జిరాఫీ చెస్ కోచ్ తేజస్ జిరాఫీ చెస్ విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ పాల్గొన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్ విధానం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానం పేదలకు వరం లాంటిదని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.జ్యోత్స్నస్వర్ణలత పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రోగి ఇంటి వద్దకే డాక్టర్, సిబ్బంది వచ్చి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లోని గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి 14 రకాల రక్తపరీక్షల ద్వారా వ్యాధులను గుర్తించి 105 రకాల మందులతో వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై, గర్భిణులకు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, వైద్య సిబ్బంది గంగాభవాని, గీత, జనార్దన్, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పందిరి బండి.. అదిరిందండి!



మండే ఎండలు మనిషులనే కాదు మూగజీవాలకూ 'ఉక్క'రిబిక్కిరి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఓ ఒంటెద్దు బండి యజమానికి ఇదిగో ఇలా బండికి పందిరి కట్టి తనతో పాటూ కోడెద్దునూ ఎండ సెగల నుంచి కాపాడుకుంటున్నాడు. ఎండ తగలకుండ పాత సంచి, వస్త్రాలతో పందిరిలా ఏర్పాటు చేసుకోవడం పలువురిని ఆకర్షింది.కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లో కనిపించిని చిత్రమిది. మూగజీవాల పట్ల ప్రేమను చూపడంతో జంతు ప్రేమికులూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. – కడప రూరల్

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ కోరారు. మంగళవారం పట్టణంలోని పెన్షనర్ కార్యాలయంలో ముద్దనూర్ మండల ఎస్టీయూ నూతన కమిటీ ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.బదిలీలు ఉపాధ్యాయులకు మేలు కలిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.